50.

# దివ్య మానవ తత్త్వమును అభివృద్ధి చేయునదే భారతీయ విద్య

**తన జీవితంబు త్యాగంబు చేసియు**
**సామాజికమును సరిగపరచి**
**వేదశాస్త్ర ఇతిహాస పురాణముల్**
**ఇంపుగ నేర్పించినట్టి ఋషులు**
**సర్వ సర్వంసహా చక్రపాలన చేసి**
**నడిపింప గలిగిన నాయకులు**
**కలరు పెక్కండ్రు భారత భువిని నేడు**
**ఉండి ఫలమేమి వారిలో ఒక్కరైన**
**అనుదినంబును వినిపించు ఆర్తనాదము**
**ఆలకింప దలంపరో ఆర్యులారా!**

**ఉత్తిష్ఠ, జాగ్రత, ప్రాప్య వరాన్ని బోధిత**

విద్యార్థులారా! లెండు, మేల్కొనుడు, లక్ష్యము సాధించునంతవరకు మీ దీక్షను విరమించకుండా చూసుకోండి. ఈనాడు కావలసింది భౌతిక భోగభ్యాగములు కాదు. జీవిత రణరంగమందు మహాయోధులై నిలచి పవిత్రమైన ధీరత్వము ప్రకటించి ఆదర్శ వీరులుగా నిల్చాలి.

**విద్యార్థులు సమాజ సంక్షేమమును, పవిత్రమైన మానవత్వమును అభివృద్ధి పరచడానికి కంకణం కట్టుకోవాలి**

విద్యార్థులారా! ప్రాచీన ఋషులు, విద్యారంగమందు ఏవిధమైన ఆదర్శమును నిరూపించిరో దానిని ఒక్కసారి విచారించి చూడండి. ధర్మమునకే వారు పట్టాభిషేకం

srisathyasaivachanamrutam

చేశారు. సత్యమునకు స్వాగతము పలికారు. ధర్మమును అందలమెక్కించారు. పవిత్రమైన వీరత్వమునకు కంకణం కట్టారు. అట్టి పవిత్రమైన భారతీయ సంస్కృతిని అభివృద్ధి పరచిన మహావీరులకు మీరు ప్రతిబింబములుగా నిల్చాలి. భారతదేశమునకు వారసులు మీరే. పవిత్రమైన ధర్మ శాస్త్రమునుద్ధరించి దేశమును కళ్యాణవంతము గావించటానికి కంకణం కట్టుకోవటానికి మీరు సిద్ధంగా ఉండాలి. 200 సం॥ల నుంచి అనంతమైన విజ్ఞాన శాస్త్రమును విరివిగా ప్రకటిస్తూ వచ్చారు. కానీ ఆ విజ్ఞాన శాస్త్రమునకు తగిన పవిత్రత వారు చేకూర్చలేదు. ఈ విజ్ఞాన శాస్త్రము భౌతికమైన నాగరికత మాత్రమే మీకు అందిస్తూ వచ్చింది. ఈనాడు దేశమునకు కావలసినది అంతః నాగరికత. భారతదేశమునందే మానవతా విలువలు నశించిన ఆధ్యాత్మికమే నశించి పోతుంది. నైతిక విలువలు పూర్తిగా క్షీణించిపోతాయి. మానవతా విలువలే మీరు విసర్జించిన దారాపుత్రాదుల సహితమైన ధర్మమునకు హాని కల్గుతుంది. మానవతా విలువలే విసర్జించిన మీ మానవత్వమునందున్న ఆదర్శమే అడుగింటి పోతుంది. ఇట్టి మానవతా విలువలను కాపాడే నిమిత్తమై నేను జన్మ ఎత్తాననే విశ్వాసము మీరు అభివృద్ధి చేసుకోవాలి. సమాజ సంక్షేమాన్ని దృష్టి యందుంచు కొని, దేశముయొక్క కళ్యాణమును దృష్టియందుంచుకొని పవిత్రమైన మానవత్వాన్ని అభివృద్ధి పరచేనిమిత్తమై మీరు కంకణం కట్టుకోవాలి.

భారతీయులు మహాశాంతపరులు. ప్రాచీనకాలము నుండి భారతీయుల యొక్క హృయదమునందు 'క్షమ' అనేది ప్రధానలక్షణంగా నిల్చినటువంటిది. మహర్షులు ఈ భారతమందు జన్మించి అనేక విధములైన ఆదర్శములు నిరూపించారు. పవిత్రమైన భారత చరిత్ర మీరు ఒక్కసారి విచారణ చేసినప్పుడు భారతీయులు ఏనాడు కూడను నిష్కారణంగా దండెత్తిపోయినటు వంటి ఘట్టము కనిపించదు. ఎందరో భారతదేశముపై దండెత్తి వచ్చి భారత సామ్రాజ్యమును ఎన్నో విధముల దోచుకొనిపోయారు. కానీ భారతీయులు అట్టి చర్యలలో ఏమాత్రము ముందుకు పోలేదు. వారి శాంతము, సౌజన్యము, సౌశీల్యము దీనికి మూలకారణము. ఇట్టి పవిత్రమైన భారతీయులయందు దివ్యత్వము, పవిత్రత రెండు నేత్రములుగా నిల్చినవి. ఇట్టి భారతదేశమును అనేక విధములుగా ఆకర్షించి, అనేకవిధములైన అల్లకల్లోలములు అభివృద్ధి పరచి అన్యాయ అక్రమ అనాచారములనే

srisathyasaivachanamrutam

బీజములను నాటి సమాజములో సంస్కృతి యందు ఒకవిధమైన అలజడి కల్పించారు. సమాజములో కలతలు రేపారు, చిచ్చుపెట్టారు. అయితే యిలాంటి పవిత్రమైన భారతదేశమందు అన్యాయ, అక్రమ, అనాచారములు భారతీయులకే మాత్రము తెలియనివి. ఆవిధంగా ఆనాడు నిత్య సత్యమైన భారతీయులందు అన్యాయ, అక్రమ, అనాచారమనే బీజములు నాటగా అవి నేడు మహా వృక్షముగా అభివృద్ధి అయిపోయి ఈనాడు మనకు అశాంతి అనే ఫలముల నందిస్తున్నది.

**ఆచరణ రూపమైన ప్రచార ప్రబోధలు మానవునకు అత్యవసరము**

చదువులనగా కేవలము గ్రంథపరిచయము మాత్రమే కాదు. ఆచరణ రూపమైన ప్రచార ప్రబోధలు మానవునకు అత్యవసరము. అభ్యసించిన విద్యలను, ఆదర్శమైన మార్గములో మనం అందించాలి. అందువలనే

**చదివి వ్రాయ నేర్చిన వారందరు విద్యావంతులేనా**
**కాలేజీ డిగ్రీలు పొందిన విద్యావంతుడగునా**
**సుజ్ఞానము సుకృతులు లేని విద్యలు విద్యలగునా**
**బ్రతుకుటకే విద్యయన్న పశుపక్షులు బ్రతుక లేదే**

భారతదేశమునందే కాదు, ఏ దేశమునందైనా ఎన్నో లక్షలు, కోట్ల విద్యా వంతులు కలరు. కానీ, ఈ విద్యావంతులందరు ఆయా దేశములకు ఏవిధమైన ఉపకారములు చేస్తూ వస్తున్నారు? సమాజమునకు ఏవిధమైన సహాయము సల్పుతున్నారు. సమాజసంక్షేమమును ఏవిధముగా వారు అభివృద్ధిపరుస్తున్నారు? లేదు. వారు స్వార్థ స్వప్రయోజనముల కోసమే ఈ విద్యను ఉపయోగించుకుంటున్నారు.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

ఈ స్వార్థము, స్వప్రయోజనము త్యజించి పరార్థము, పరోపకారమనే దీక్షను మీరు పూనాలి.

**నిత్యసత్య సుకృతులన్ని వికృతులుగ మారుచుండె**
**ప్రశాంతి రూపమైన ప్రకృతి ప్రజల వీడి పోవుచుండె**

sri sathyasaivachanamrutam

**ఆర్యవేద విద్యలణగె దుర్విద్యలు పెరుగుచుండె**

**త్యాగమయమైన దేశభక్తి, ప్రేమమయమైన దైవభక్తి విద్యార్థి రక్తములో ప్రవహించాలి**

తన పాదముల తాను నిలబడే శక్తినందించేది, భారతీయ విద్య. పరోపకార నిమిత్తమై దేహమును కూడా త్యాగము చేసే మహాభాగ్యమును అందుకున్న విద్య, భారతీయ విద్య. మానవత్వపు విలువలను రక్షించటానికి తన సర్వస్వము అర్పించిన దేశము భారతదేశము. ఇలాంటి పవిత్రమైన భారతదేశ మందు పుట్టిన భారతపుత్రులు, పుత్రికల యొక్క తత్వాన్ని మనం కొంతవరకు విచారణ చేసి చూడాలి. భారతమాత బిడ్డలని అనిపించుకున్నవారము. భరత మాత యొక్క సంక్షేమాన్ని కొంతవరకు దృష్టియందుంచుకోవాలి. ఇట్టి దయా హృదయులుగా మార్చేదే నిజమైన విద్య. ఈనాటి విద్య కేవలం మేధాశక్తిని మాత్రమే అభివృద్ధి చేస్తున్నది గానీ హృదయ విశాలతను ఏమాత్రం పెంచటం లేదు. విశాలహృదయము పెంచుకోలేని విద్య కేవలం విషమయమైనది. విద్యను కేవలం భౌతికమార్గములో ప్రవేశపెట్టినప్పుడు మీరు శిలాహృదయులై పోతున్నారు. త్యాగమయమైన దేశభక్తి, ప్రేమమయమైన దైవభక్తి, ఈ రెండు విద్యార్థి హృదయములో, రక్తములో ప్రవహించాలి. అట్టి అభివృద్ధి గావించుటకు తగిన ప్రయత్నం చేయాలి.

**విద్య యొసగును వినయంబు**
**వినయము వలన కలుగు పాత్రత**
**పాత్రత వలన ధనము, ధనంబు వలన**
**ధర్మంబు, దీని వల్ల దైవంబు**

ఇలాంటి మానవత్వముతో కూడిన దివ్యత్వాన్ని అందుకోలేకపోయినప్పుడు కాలమును వ్యర్థముచేసుకోటమే కాకుండా జీవితాన్ని కూడా అపవిత్రము గావించుకున్నట్లవుతుంది.

**పరమ పావనమైన భారతావనియందు**
**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నిటను వన్నె గాంచిన యట్టి**
**ఘనసత్యశీలమే కఠిన తపము**

sri sathyasai vachanamrutam

**మధుర భావంబేది మన దేశమందన్న**
**మాతృభావము కంటె మాన్యమెద్ది**
**ప్రాణంబు కంటెను మానంబె ఘనమను**
**మన దేశ నీతిని మంట గలిపి**
**నేటికిచ్చిరి పరదేశ నీతులరసి**
**వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి**
**ఔరా! ఏ మందు భారత పాలనంబు**
**ఏనుగెట్టుల తన బలమెరుగలేదో**
**అట్టులైనారు భారతీయులు నేడు**

## చదువు సార్థకము గావించుకోవాలన్నప్పుడు విద్యార్థులు సమాజసేవలో పాల్గొనాలి

ప్రాచీనకాలమునుండి పవిత్రమైన శక్తిసామర్థ్యములను ప్రపంచమునకు అందించిన ఆదర్శవంతమైన భారతీయులు ఈనాడు ఆ పవిత్రమైన భావములు కోల్పోయి, బలహీనులమై అనేక చిక్కులకు గురౌతున్నారు. విద్యావిధానము ప్రపంచములో విరివిగా పెరుగుతూనే ఉంటున్నాది. పల్లెపల్లెకు పాఠశాలు ప్రారంభిస్తున్నారు. వీధి వీధియందు స్కూళ్లు పెడుతున్నారు. కానీ దీని ఫలితము ఏమిటి? కేవలం పాఠశాలలు ప్రారంభించినంత మాత్రమున, ప్రతి విద్యార్థి విద్యను అభ్యసించిన మాత్రమున కలిగిన ప్రయోజనము ఏమిటి? ఏమీ ప్రయోజనం లేదు. విద్యకు ఉండవలసిన వినయము ఈనాడు విద్యార్థియందు కానరావటం లేదు.

**మేలు చేసినవానికే కీడు చేయు**
**కూడు పెట్టిన వానినే కూలద్రోయు**
**విద్య చెప్పిన వానినే వెక్కిరించు**
**ఇదియె ప్రొగ్రెస్సు ఈనాడు విద్యయందు**

అన్నట్లు ఉన్నది నేటి పరిస్థితి. స్కూలుకు పోయే వారందరు విద్యావంతులే అనుకుంటున్నారు. కానీ ఆ విద్యయందున్న పవిత్రమైన, నిత్యమైన, సత్యమైన భావాన్ని

sri sathyasai vachanamrutam

గుర్తించిన వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తున్నారా? కనుక వీరు చదివినందుకు, చదువు సార్థకము గావించుకోవాలన్నప్పుడు సమాజ సేవలో మీరు పాల్గొనాలి. దేశమును పరిశుద్ధమైన దేశముగా మీరు తీర్చిదిద్దాలి. ప్రతి మానవునికి మానవతా విలువలు పంచాలి. మానవుని మానవునిగా పెంచినంత మాత్రమున చాలదు; పరిపూర్ణ మానవునిగా పెంచాలి. అప్పుడే ఈ విద్యయొక్క విషయము సార్థకమైనదిగా కనిపిస్తుంది.

విద్యార్థులారా! మీరు చదివిన చదువుకు సరైన సార్థకత, గౌరవాన్ని అందించుటకు మీరు కంకణం కట్టుకోవాలి. వినయ విధేయతలతో పెద్దలను గౌరవించి సమాజములో ఆదర్శవంతమైన జీవితమును మీరు అందించాలి. అప్పుడే మీ విద్యకు తగిన విలువను మీరందుకున్న వారౌతారు. గొప్ప డిగ్రీలు మాత్రమే పెట్టుకొని, నడతలు చూస్తే విరుద్ధమైనదిగా ఉండినప్పుడు డిగ్రీల విలువ ఎక్కడుంటున్నాది? మార్కులు తెచ్చుకోవటం గొప్ప కాదు. విద్యార్థులారా! మీ జీవితంలో రిమార్కులు తెచ్చుకోకుండా చూచుకోండి. ఈనాడు విద్యాసంస్థలు వ్యాపారసంస్థల వలె మారిపోతున్నాయి. ఒక్కొక్క విద్యార్థికి నూటికి 35 మార్కులు వస్తే ప్యాసై పోతున్నాడు. యింక 65 మార్కులు ఏమైపోయినట్టు? ఒక వ్యక్తికి నూరు పనులు చెప్పినప్పుడు 65 పనులు చెడగొట్టి 35 పనులు మాత్రమే చేస్తే వీడు ప్యాసైనట్లు ఎట్లా అవుతుంది? ఆనాడు ప్రాచీన విద్యల ప్రకారము నూటికి నూరు మార్కులు తేవాలి. అదియే నిజమైన విద్య. ఇలాంటి మార్కుల కోసం మీరు పాటుపడకండి. పవిత్రమైన హృదయాన్ని విశాలము గావించు కోటానికి విద్యను అభ్యసిస్తున్నామనే వివేకమును మీరు అభివృద్ధిపరచుకోండి. విద్య చదివినంతమాత్రము చాలదు. విద్యతోబాటు వివేకము కూడా ఉండాలి. కనుక, విద్య యొక్క విధానాన్ని, ప్రాచీన ధర్మాన్ని ప్రాచీన విద్య తత్వాన్ని చక్కగా మీరు విచారించి చదవాలి. ఈ ధర్మ విద్యా విధానములో ఎంత మీరు అభివృద్ధి అవుతారో దేశము అంత పవిత్రదేశముగా రూపొందుతుంది. దేశము యొక్క భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉంటుంది.

**నీతినియమాలు గ్రంథాన నిల్చిపోయె**
**హృదయమంతయు దుర్గంధ సదనమయ్యె**
**చేతలంతయు స్వార్థంబు చేతలయ్యె**

srisathyasaivachanamrutam

ఇదియె ప్రొగ్రెస్సు ఈనాటి విద్యలందు

ఇదియే ఈనాటి విద్యలు. నీతినియమాలు ఆచరణయందు చూపాలి. కేవలం గ్రంథములందు చదివి ప్రయోజనం లేదు. అది ఒక పుస్తకము. ఇది ఒక మస్తకము. మస్తకము నందున్నది నీవు ప్రాక్టికల్ లో ప్రవేశపెట్టాలి. ఆచరణలో పెట్టినప్పుడే జీవితము ఆదర్శవంతమవుతుంది.

**నీవు నీ conscience ను అనుసరించు**

విద్యార్థులారా! మీకు అనేక పర్యాయములు చెప్పాను. ఈ జ్ఞానము 5 రకములుగా ఉంటున్నాదని. మొట్టమొదటిది bookish knowledge. అదే superficial knowledge. రెండవది general knowledge. మూడవది ఆదర్శవంతమైన discrimination knowledge. విచారణశక్తితో మనం విచారించి దానిని సరైన మార్గములో పెట్టుకోవాలి. ఈ discrimination knowledge కూడా ప్రయోజనం లేదు. General knowledge కావాలి. ఈ general knowledge develop చేసుకొని practical knowledge లో మనం ప్రవేశించాలి. General knowledge zero ఉంది. Practical knowledge లో ఏవిధంగా ప్రవేశించగలరు? Common sense, general knowledge మనిషికి చాలా అవసరం. కనుక, మొట్టమొదట జీవితాన్ని సరైన మార్గంలో పెట్టుకోవాలి. అప్పుడే పదిమందికి ఆదర్శంగా రూపొందగలరు. అందుకే జీవితంలో పాటించవలసిన 4 F ల గురించి ఎప్పుడు చెపుతుంటాను.

మొదటి F : Follow the master. Who is your master? Your conscience is your master. Follow your consicence. వారిని వీరిని అనుసరించవద్దు. నీ అంతరాత్మను నీవు అనుసరించు. అదే follow the master. రెండవ F : Face the devil, దుర్గుణములను ఎదురుకో. 3 వ F : Fight to the end, చివరిదాక పోరాడు. నాల్గవ F : Finish the game, జీవితమనే ఆటను విజయంతో వరించు. ఈ ఆట నిమిత్తమై జన్మించావని గుర్తించి నడవాలి. ఈనాటి విద్యార్థులకు ఆత్మవిశ్వాసమే లేదు. ఎప్పుడు ఈ ఆత్మవిశ్వాసము అభివృద్ధి అవుతుంది? నిజమైన ఆత్మ విశ్వాసము రావాలంటే దేశ

sri sathyasai vachanamrutam

విశ్వాసాన్ని సరైన రీతిలో అభివృద్ధి పరచుకోవాలి. త్యాగమయమైన దేశభక్తి కావాలి. భోగమయమైన దేశభక్తి కాదు. ప్రేమమయమైన దైవభక్తి రావాలి. త్యాగమయమైన దేశభక్తి, ప్రేమమయమైన దైవభక్తి రెండు ఆవిర్భవించనప్పుడు మీ విశ్వాసము తప్పక అభివృద్ధి అవుతుంది.

ఈనాడు ప్రతి చిన్న విషయమునకు సందేహములే. ప్రతి మానవుడు యీనాడు చూస్తే ఆత్మ న్యూనత (depression) తో బాధపడుతున్నాడు. ఈ depression చాలా అధికంగా ఉంటున్నది ఈ కలి ప్రభావముచేత. ఈ depression ఏనాడు తొలగిపోతుందో ఆనాడు మానవునిలో మానవత్వం వికసిస్తుంది. చిన్న చిన్న దానికంతా depression. ఈ depression కి కారణం నీ యొక్క బలహీనతే. నీవు బలహీనుడవు కాకూడదు. ఆత్మ విశ్వాసము ఉన్నప్పుడు మీరు బలహీనులే కాదు. ఆత్మవిశ్వాసము లేనివాడే బలహీనుడు. భారతదేశము మీ నిమిత్తమై ఎంతయో ధనమును దాచిపెట్టింది. భారతదేశ మందు కావలసినంత భాగ్యముంటున్నది. దీన్ని మీరు గుర్తించుకోటానికి ప్రయత్నించటం లేదు. ఏమిటి ఈ భాగ్యము? అదియే మీ త్యాగభాగ్యము. అదియే ఆధ్యాత్మిక భాగ్యము. అదే సమాజములో పనిచేసే భాగ్యము. ఇదియే మీ భాగ్యము. ఇలాంటి పవిత్రమైన భాగ్యము మన భారతదేశమునందు నిండి ఉండి కూడా మీరెందుకు కాలాన్ని వ్యర్థము చేస్తున్నారు? కాలమును వ్యర్థము చేయకూడదు. ప్రతి మానవుని దేహము కర్మతో కూడినదే. 'కర్మానుబంధీని మనుష్యలోకే'. మన దేహము కర్మాచరణ కోసమే వచ్చింది. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం'. భారతీయ సంస్కృతియందు ఈ సత్యమును మీరు గుర్తించాలి. కానీ మీరు ఈ సత్యాన్ని గుర్తించటం లేదు. దేహము ఎందుకోసం వచ్చింది. కేవలం తిని తిరిగి చచ్చిపోవటానికి వచ్చిందా? ఈ దేహాన్ని పదిమందిని సంతోష పెట్టేదానిలో సార్థకం చేసుకోవాలి. కడపటి వరకు పరులకు సహాయం, సహాయం చేయాలి. దీనినే మన భారతీయ సంస్కృతి యందు

**"పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం"** అన్నారు.

Help ever Hurt never అని దీని అర్థం.

sri sathyasai vahini amrutam

కడపటి శ్వాసవరకు మన చేతలు help కి అంకితము కావాలి. అప్పుడే మన జీవితం సార్థకమవుతుంది. పుట్టిన ప్రతివ్యక్తి ఆదర్శము నిరూపించి చూపించాలి. ఏమిటి ఆదర్శము చూపిస్తున్నావు? పవిత్రమైన ఆదర్శమును చూపాలి. పదిమంది మెచ్చుకునే ఆదర్శము చూపాలి. పదిమందికి ఆనందమునందించే ఆదర్శము చూపాలి. పదిమంది అభివృద్ధి పొందే ఆదర్శము చూపాలి. కానీ యిట్టి ఆదర్శము యీనాడు ఎక్కడా కనిపించటం లేదు.

**నైతికమును ఆదర్శము చేసుకునే కర్మలలో ప్రవేశించాలి**

విద్యార్థులారా! పవిత్రమైన మానవజన్మ ఎత్తి కూడను జన్మ సార్థకం చేసుకోకపోతే ప్రయోజనం ఏమిటి. దుర్లభమైన మానవజన్మను ఏవిధంగా పవిత్రం చేసుకోవాలి? సౌభాగ్యముతో కూడిన జీవితం మానవ జీవితం. సౌశీల్యముతో కూడినది మానవ జీవితం. సత్సంపత్తితో కూడినది మానవ జీవితము. సచ్ఛీలముతో కూడినది మానవజీవితము. ఇలాంటి మానవ జీవితమును పరోపకార నిమిత్తమై అంకితము చేయాలి. కేవలం ధనార్జనకోసం ప్రాకులాడకూడదు. ధనం కోసం చదువుతున్నామనుకుంటున్నారు. చాలా పెద్ద తప్పు అది. మన చదువు సమాజంలో చక్కగా ఉపయోగపెడుతుంటే ధనం దానిపాటికదే వస్తుంది. కానీ, ఈనాడు విద్యాసంస్థలయందు ధనమునకై అన్ని విధములైన పాట్లు పడుతున్నారు.

**ధనము దైవంబయ్యె దర్పంబు మతమయ్యె**
**స్వార్థమే బుద్ధికి స్థానమయ్యె**
**అహము ఫేషనయ్యె ఆశలందంబయ్యె**
**ధర్మంబు వమ్మయ్యె దాత్రిలోన**
**దయయు హీనంబయ్యె నయము శూన్యంబయ్యె**
**కపటమే జీవులకాంతులయ్యె**
**ప్రేమానురాగముల్ రోగాలపాలయ్యె**
**కామాంధులుగ చేసె కలినిచదువు**
**బ్రతుకు బరువయ్యె మతులకు గతులు తప్పె**



sri sathyasai vahanamrutam

**జాగుచేసిన నేగతి జగతి యగునో**
**విద్యయందున్న నైతిక విలువ జేర్చి**
**భారతబిడ్డలమని పేరు బడయరయ్య**

ప్రతికర్మలు నైతికముతోకూడి ఉండాలి. నైతికమును ఆదర్శము చేసుకునే మానవుడు కర్మలలో ప్రవేశించాలి. అదియే moral wealth. నైతికాన్ని తీసుకున్నప్పుడు భారత పుత్రులనే సార్థకత అందుకోగలరు.

ప్రేమ స్వరూపులారా! ప్రాచీనకాలమునుండి దేశదేశములకు కూడా ఆధ్యాత్మిక సంపత్తినందించి **'లోకాస్సమస్తా సుఖినోభవంతు'** అనే సూక్తిని ఆచరించిన సార్థకనామమును ఒక్క భారతదేశమే అందుకుంది. అట్టి ఆదర్శమును తిరిగి మీరు ప్రారంభముచేయాలి. వీధి వీధిలో, వాడవాడలలో, ఇంటి ఇంటియందు మీరు ప్రవేశించాలి. దివ్యమైన, నవ్యమైన భావాలు ప్రపంచములో చాటాలి. ఐకమత్యాన్ని మీరు అభివృద్ధి గావించాలి. ఏవిధముగానైనా మాటయందు గానీ, పాటయందుగానీ, ఆటయందుగానీ మీరు ఐకమత్యముతో పనిచేయాలి. ప్రతి ఒక్కరు సోదరులు మాదిరి భావించాలి. Brother hood of man and father hood of God అనేది పెంచుకోవాలి. ఎవరిపైనా అసూయ రాకూడదు. ఈనాడు చూస్తే అన్నింటి యందు అసూయనే. అసూయ అనేది నివారణ కాని రోగము. ఆ రోగ్యమునకు మన పిల్లలు పాల్పడకూడదు. ఎవరైనా మనలను దూషించారా! సంతోషమే ఆనందంగా అనుభవించు. ఆ దూషణ భూషణగా భావించుకో. మీరు దూషణ భూషణ తిరస్కారములకు, పురస్కారములకు ఏమాత్రం లొంగకూడదు.

**యావత్ప్రపంచమునకు భారతదేశము అధ్యాపక స్థానము తీసుకోవాలి**

విద్యార్థులారా! మీరు గురుభక్తిని, మాతాపితరుల భక్తిని అలవర్చుకోవాలి. ఇంతకు ముందే చెప్పాడు వైస్ ఛాన్స్‌లర్. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ' అన్నారు. తైత్తరీయ ఉపనిషత్తునందు, విద్యార్థులు విద్యనభ్యసించి తమ తమ స్థానములకు పోయే సమయంలో అధ్యాపకులు వీరందరిని చేర్చి ఉపదేశం చేసింది

srisathyasaivachanamrutam

ఇదే. దీనినే ఒక స్నాతకోత్సవము (convocation) అని పేరు పెట్టారు. ఈ విద్య చాలా పవిత్రమైనది. ఇదియే దైవస్వరూపము. ఆ విద్య ప్రతి ఒక్కరియందు ఉంటున్నాది. నేను చెప్పాను నిన్న education అనే పదము ఎక్కడనుండి వచ్చింది? దీనికి ఒక విధమైన అంతరార్థము కూడా ఉంటున్నాది. ఇది 'educare' అనే పదము నుండి వచ్చింది. Educare అనగా బయటకు తీయటం. ఎక్కడనుండి తీయటము? మన హృదయమునుండి తీయటము. తలనుండి తీసినది ప్రవృత్తి విద్య, హృదయము నుండి తీసినది నివృత్తి విద్య. నిజమైన విద్య హృదయము నుండి వచ్చినదే. ఇవన్నీ సరైన విద్యలు కాదు. ఇది బాహ్యమైన విద్య. ఈనాడు నేర్చుకునే విద్యలు కేవలం తలనుండి వచ్చినవే. కానీ హృదయము నుండి వచ్చేవి ప్రేమ, సహనము, సానుభూతి, సత్యము, దయ, కరుణ అన్నీ. ఇందుకు రెండుచక్కని ఉదాహరణలు చెప్పి విరమిస్తాను.

**మానవుడు తనను తాను తెలుసుకోవాలి**

ఒక విద్యార్థి ఉన్నాడు. ఈ విద్యార్థిని పూర్తిగా గుర్తించినట్లు నీవు ఏవిధంగా చెప్పగలవు? 6 అడుగుల ఎత్తు, తెల్లగ ఉన్నాడు, బరువు 70 kgs అని height, weight చెప్పినంత మాత్రమున వాని గురించి పూర్తిగా గుర్తించిన వారమవుతావా? ఇది కాదు. వానిలో నీకు తెలియని గుణములు ఎన్నియో ఉంటున్నావి. ఈనాడు సైన్స్ & టెక్నాలజీ ఎంతో అభివృద్ధి అవుతున్నాది. సైన్స్ & టెక్నాలజీ అంటే ఎంతో గొప్పగా భావిస్తున్నారు లోకములో. సైన్స్ & టెక్నాలజీ ని ఎన్నో వేల సంవత్సరముల క్రితము భారతదేశములో హిరణ్యకశిపుడు కనిపెట్టాడు. ఈనాడు సైంటిస్టులు చంద్రమండలం వరకు పోయినారు. ఆనాటి హిరణ్యకశిపుడు ధృవనక్షత్రం వరకు పోయాడు. అంత గొప్ప సైంటిస్టు కుమారుడు చిన్న విద్యార్థి ప్రహ్లాదుడు. వాడు చెప్పాడు తండ్రికి.

**లోకములన్నియున్ ఘడియలోన జయించినవాడ వింద్రియా**
**నీకము జిత్తమున్ గెలువనేరవు నిను నిబద్ధు జేయు**
**భీకర శత్రులార్వుర ప్రభిన్నుల జేయుము ప్రాణికోటిలో**
**నీకు విరోధి వేరొకడు న్దేర్వున జూడుము దానవేశ్వరా!**

sri sathyasai vahamrutam

ఇదియే కలియుగమందు బ్రిటీషు ప్రధాన మంత్రి గా ఉండిన చర్చిల్ చెప్పాడు. Man has conquerred all, but he has not conquerred himself. తనను తాను తెలుసుకోలేదు మానవుడు. ఒకానొక సమయంలో గాంధీ చాలా విచారంగా పండుకున్నాడు పాపం. ఒక విదేశీయుడు ఏమి గాంధీ గారు ఏమి విచారము చేస్తున్నారన్నాడు. 'విద్యా విధానము గురించి నేను విచారిస్తున్నాను' అన్నాడు. ఏమి? బ్రిటీషు విద్యావిధానము చక్కగా లేదా? అని ప్రశ్నించాడతను. హృదయము కఠినము గావిస్తున్నది ఈ నవీన విద్యా విధానము. ఈ కఠిన హృదయులుగా తయారుచేసే విద్య మానవుని ఏమాత్రం అభివృద్ధి పరచదు. హృదయము కఠినముగా నున్నప్పుడు మానవుడు జీవించి ఏమి ప్రయోజనం? శిలాహృదయుడుగా మారిపోతాడు. కనుక ఈనాటి సైన్సు శిలా హృదయునిగా మార్చివేస్తున్నది మానవుని. ప్రేమ హృదయముగా మార్చాలి. దయా హృదయులుగా మార్చాలి. శాంతి హృదయంగా మార్చాలి. అదియే సైన్సు. సైన్సు రెండు భాగములు. హైడ్రోజన్, ఆక్సిజను కల్సినప్పుడు water అవుతుంది అని చెబుతుంది. మంచిదే. నేను నీటిని తయారు చేశానని గర్వించవచ్చును. అది గొప్పతనము కాదు. ఆ నీటిని అందరు సమానంగా పంచుకోవాలి, అదే గొప్పతనము. ఆ జలమును ప్రతి ఒక్కరు అధికారమైన రీతిలో అనుభవించాలి. నిజమైన right. ప్రతివాడు ఈనాడు right, right అని fight చేస్తున్నాడు. Right కు fight చేస్తున్నావు గానీ what about responsibility. బాధ్యతను కూడా నీవు తీసుకోవాలి. బాధ్యతను తీసుకోకుండా హక్కు right అని పోతే ఏమిటి right. ఒకడు Right అంటే మరొకడు left అంటాడు. ఇదా రైట్.

విద్యార్థులారా! మీ right కి ఎవ్వరికి అధికారము లేదు. మన కర్తవ్యము చక్కగా నిర్వర్తించినప్పుడు దానంతటఅదే హక్కు వచ్చేస్తుంది. Right కి ప్రత్యేక సాధనలు అవసరం లేదు. నీ duty నీవు సక్రమంగా చేసుకుంటూ పో. Do your duty. Duty is God. Work is worship. ఏది నీ right అని విచారించినచో పదిమందిని ఆనంద పెట్టటమే నీ right. మీరు విశాల హృదయులై పవిత్ర భావముచేత, నిస్వార్థ భావము చేత, సర్వమానవులను సంతోష పెట్టటానికి సేవలో పాల్గొనాలి. Service is God. The best way to love god is to Love all and serve all. అందరిని ప్రేమించాలి. అందరిని సేవించాలి. ఈ సత్యాన్ని మీరు చక్కగా



sri sathyasai vachanamrutam

గుర్తించుకొని పెద్దలను గౌరవించి మంచి మాటలతో మీరు జవాబివ్వాలి. You can't always oblige, but you can speak always obligingly. ఈ పవిత్రమైన మెత్తని మాటలతో, తీయని మాటలతో వ్యక్తులను ఆనందపర్చాలి. అది నిజమైన భారతీయ విద్య. ఆధ్యాత్మిక తత్వాన్ని అందించి, అంతర్ముఖమైన సంస్కృతిని పోషించి, దివ్యత్వమైన మానవత్వాన్ని అభివృద్ధి పరచే విద్య ఒక్క భారతీయ విద్య ఒక్కటే.

**విద్యార్థులు సత్య, ప్రేమ మార్గాలలో ప్రవేశించాలి**

విద్యార్థులారా! మీరు బయటకు వెళ్లి, దేశములో నాలుగు మూలలు సంచరించి ఆదర్శవంతమైన సత్యాన్ని అభివృద్ధి పరచాలి. సత్యమార్గమునకై సర్వము త్యాగం చేయండి. సత్యాన్వేషణలో మీరు మునగండి. సత్యమే దైవము. Truth is God. Love is God. Live in Love. Live in Truth. రెండు నేర్చుకోండి. ఇంతకంటే భాగ్యము మరొకటి లేదు. సత్యమార్గములో ప్రవేశిస్తే తప్పక సర్వ భాగ్యములు లభ్యమవుతాయి. ప్రేమ మార్గంలో ప్రవేశిస్తే సర్వసంపదలు లభ్యమవుతాయి. ఎవ్వరు ఏమనుకున్నా ఏమాత్రం చలించవద్దు. చలించని మనస్సు భ్రమించని దృష్టి మీరు పోషించాలి. కనుక మన సంస్థ విద్యార్థులు సార్థకమైన పేరు తెచ్చుకోవాలి. మన సంస్థవలె దేశములో మరొక సంస్థ లేదు. 1వ తరగతిలో చేరాలంటే 10వేలు, 20 వేలు డొనేషను కట్టాలి. ప్రతి దానియందు KG మొదలు PG వరకు వ్యాపారమే. అది కాదు మనది త్యాగం, త్యాగం. ఆ ఒక్కదాన్ని మీరు పోషించుకోండి. ఎవరికైనా మీరు విద్య నేర్పాలంటే త్యాగము చేసి ఉచితముగా విద్య నేర్పండి. మీరు నేర్చుకున్న సద్విద్యలు యితరులకు ఉచితంగా అందించండి. అదియే **'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః'.** ఈ వాక్యమును అందరు చెప్పండి. (విద్యార్థులందరు ఏక కంఠముతో చెప్పినారు). త్యాగములో మీరు ప్రవేశించండి. త్యాగములో ఎంతో యోగం ఉంటున్నది బంగారు. నిజమైన యోగం త్యాగమే. దానికోసం మీరు పాటు పడండి. తల్లిదండ్రులను సంతోషపెట్టండి మొట్టమొదట. తోటి మానవుని అభివృద్ధికి పాటుపడండి. వేదవాణిలో మొట్టమొదట చెప్పింది ఇదియే.

sri sathyasai vachanamrutam

"సహనా వవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై
ఓం శాంతిః శాంతిః శాంతిః"

**కలసి మెలసి తిరుగుదాం కలసి మెలసి పెరుగుదాం**
**కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం**
**కలసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం**

అని దీని అర్థము. ఇలాంటి పవిత్ర ఆదర్శమును మీరు ప్రపంచానికి అందించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 22-11-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam